# పెద్ద దిక్కు

జానకమ్మగార్ని మాత్రం ఎన్నటికీ మరవలేను. ఈకాలపు యువకులకు పెద్దవాళ్ళను చూస్తే నిర్లక్ష్యం జాస్తిగా కనపడుతుంది. కాస్త తెలివిగల వాళ్ళ మనుకునేవారికి మరీనూ! వెనకటి వాళ్ళెట్లా కాపరాలు చేశారో తెలీదు. కాని ఈ కారుకు సంసారాలు నిర్వహించుకు రావటం బొత్తిగా తెలీదు. ఇంగ్లీషు చదువు వల్ల మనుష్యులు తెలివిగలవాళ్ళయితే కావచ్చు, కాని వీళ్ళ తెలివితేటలు సంసారా లీదటానికెందుకూ అక్కరకు రావటంలేదు. కష్టాలొచ్చినా, సుఖాలొచ్చినా తట్టుకునే నేర్పూ, ఓర్పూ, వివేకమూ ఇంగ్లీషుచదువుతో రాకపోగా ఉన్నది కూడా అడుగంటుతున్నది.

నేను కాపరానికి పొయ్యేసరికి మావా రప్పుడే పోలీసు నౌకరీ చేస్తున్నారు. కొత్త సంసారం కదా! అని వారి అమ్మమ్మ వెంట ఉంటానంటే వద్దన్నారు. నేను

చెప్పొస్తే నన్ను కోప్పడ్డారు. "నీకూడా మతిలేదా ఏమిటి? చక్కగా మనం ఇష్టం వచ్చినట్టు కాపరం చేసుకోకుండా ఆవిడెందుకు వెంట పానకంలో పుడకల్లే? పచ్చిపుల్ల మడిలో పెట్టి చంపుతుంది ఆలోచించుకో!" అని. నేను వారి మాటలు వెంటనే నమ్మాను. ఆడవాళ్ళం తెలివిగల వాళ్ళమని కాని, మగవాళ్ళ మాయ మాటలకు లొంగిపోమని కాని నేనంటే ఎవరు నమ్ముతారు?

మా కాపరం బాగాలేదని కాదు! మా బంధువర్గంలో అందరూ మా దాంపత్యాన్ని ఆదర్శంగా తీసుకున్నప్పుడు నేనింకొక రకంగా ఎందుకనాలి? మావారి కన్న మంచి మనిషి, ఆపేక్ష, అంతఃకరణలు గల మనిషి భర్త కావాలని ఏ స్త్రీ కూడా కోరనవసరం లేదు. అనేక కాపరాలు చూశానుగదా! కాని చాలా లోట్లు వస్తుండేవి. ఇంకొకరికి చెప్పుకుని వారి సానుభూతి పొందదగినంత పెద్ద లోపాలు కావు. దిగమింగుకునేందుకు మింగుడుపడేవీ కావు. ఆపేక్ష ఎంత వున్నా మగవాళ్ళు ఆడదాని మనస్సును సుకుమారంగా చూడరు. మనసుకు కష్టం తోచినప్పుడు అది మళ్ళీ మగవాళ్ళకు తెలియనివ్వరాదు. దానివల్ల గాయం మరింత పెద్దది కావటమే కాని ఏమీ లాభం లేదు. అందుచేత ఆడదాని కమిత ఓర్పు, నిబ్బరం ఉండాలి. కొంతమంది ఆడవాళ్ళు కవి లేక, చప్పున కుండ మొహాన పగలగొడతారు—వెనకాముందు చూడకుండా. ఇటువంటి సంఘటన కలిగినప్పుడల్లా ఓర్పు లేకపోవటం ఆడదాని తప్పా? లేక ఆడదాని మనసు శని పెట్టలేక పోవటం మగవాని తప్పా? అని నాకు అనుమానం కలుగుతుంది. బాగా ఆలోచించక స్త్రీ పురుషుడికన్న శరీర బలంలో తక్కువైనట్టుగానే పురుషుడు స్త్రీకన్న మనో నిగ్రహంలో హీనుడుగా కనిపిస్తాడు. కాబట్టి ఆడదాని మనసు సుకుమారం కాగానే లాభం లేదు. దానికి తోడు ఓర్పు, వివేచనా ఉంటే కాని ఆడది రాణించదు. పైగా ఆడది మనసులో పెట్టుకున్నట్టు మగవాడు పెట్టుకోడు. అందుచేత భార్యాభర్తా పోట్లాడుకున్న తరవాత ఎక్కువ అన్యాయం జరిగేది మగవాడికి.

నేను కాపరానికి పోయిన నాలుగేళ్ళకు మా వారికి గుంటూరు బదిలీ కావటం, మేం జానకమ్మగారింట్లో అద్దెకు ప్రవేశించటం తటస్థించింది. ఆవిణ్ణి తలుచుకుంటే కొండలూ, సముద్రాలూ జ్ఞాపకం వస్తాయి. నిజంగా! మేం వాళ్ళింట్లో ఉన్న సంవత్సర కాలంలో ఆవిడ మాట్లాడ్డంలో కాని, ప్రవర్తనలో కాని ఒకసారీ తొణికి ఎరగదు. నిండుకుండ! అగాధం! విశ్వ ప్రయత్నం చేసి ఆవిడలో ఈ లోపం ఉందని ఎంచలేక పోయినాను. ఆవిడలోతు నాకు తెలియనే లేదు.

వారిది పెద్ద లంకంత ఇల్లు. చాలా స్థితిపరులు. ఆమె భర్త జీవించి ఉండగా ఎడతెగకుండా ఇంటినిండా జనం ఉండేవారట. మేమా ఊరువచ్చేనాటి కాయన గతించి నాలుగైదు సంవత్సరాలయింది. ఆ ఇంటికి అద్దెకు రావటానికి మేమే మొదలు. ఒక భాగంలో ఆమె కొడుకు సత్యనారాయణ, కోడలు రాధా, మనుమడు "చిట్టీ" ఉండేవాళ్ళు. మిగిలిన భాగంలో మేం ఉండేవాళ్ళం. మనుమడికి జానకమ్మగారు భర్త పేరే పెట్టించుకుంది. కాని "చిట్టి" అని పిలిచేది. వాడికా పేరే "సార్థకనామ" మయింది.

మా భాగానికద్దె పన్నెండు రూపాయలు. "ఈ ఊళ్ళో ఇళ్ళింత చౌకటండీ!" అన్నా నేను మా వారితో.

"చౌకా? మనం పోలీసు వాళ్ళం కనుక మనకు దొరుకుతుంది, కాని లేక పోతే ఈ భాగానికి పాతిక రూపాయలకు తక్కువ అద్దె ఉండదు." అన్నారు.

ఇది మేం వచ్చిన్నాడుదయం. ఇప్పటికి నేనింకా జానకమ్మగారి మొహం చూళ్ళేదు, మావారు అవసరమైన సామగ్రి పంపిస్తానని ఒక పోలీసును వెంట బెట్టుకెళ్ళారు. వారు వెళ్ళగానే జానకమ్మగారొచ్చింది. నాపేరడిగి కనుక్కుంది.

"అయితే అన్నపూర్ణమ్మా, యీ పూటకేమైనా లేకపోతే వంటకిబ్బందౌతుందేమో, ఏం కావాలిసినా యిస్తాను తీసుకో అమ్మా!" అంది.

నేను బోళాదాన్ని కావటంచేత నాకట్లా ఉంటుందో, లేక అందరికీ అట్లాగే ఉంటుందో కాని, ఒక్క మంచి మాటతో నేను కరిగిపోతాను, "ఏమీ అక్కర్లేదండీ!" అన్నీ ఉన్నై. కావలసినది పోలీసు తెస్తాడు" అన్నాను. అవిడ నా మాట వినిపించుకోక అన్నీ పరీక్ష చేసి, తమ యింట్లోనించి బండెడుపాత్ర సామగ్రీ, బుట్టెడు కూరగాయలూ తెచ్చి పడేసింది. మావారి శ్రద్ధకూడా మాగొప్పది. నా వంటంతా అయిన తరవాత పోలీసు సామానుతో రొజుకుంటూ వచ్చి "అయ్యగారు దారిలో స్నేహితులతో కలిసి మాట్లాడుతూ సామానుమాట మరిచిపోవటంవల్ల ఆలస్యమైంద"ని చెప్పాడు. "అయ్యగారూ గొప్పవారే స్నేహితులూ పెద్దమనుషులే!! వంటయిందని అయ్యగార్ని వేగిరం పంపిం" చన్నాను. తరవాత వారితో జరిగిన సంగతి చెబితే– మగవాళ్ళకు మెప్పులేదు!– "ఈ పాడుద్యోగం ఎందుకు? అంటివే, తెలిసొస్తున్నదా?" అన్నారు పైగా. పాపం మగవాళ్ళకేం తెలుసు వాళ్ళ తెలివితేటలుచూసి మనం ఎంత నవ్వుకునేది!

అదే మొదలు! జానకమ్మగారు మాకేదో ఒకటి ముట్టచెప్పకుండా నిద్ర పొయ్యేదికాదు. ఒకరోజున నేనావిడతో "మీకిస్తున్న అద్దెకాస్తా తిరిగి మాకే అప్పగిస్తున్నారు. అటువంటివారు ఇళ్ళద్దెకిచ్చుకోటమెందుకు?" అన్నాను. ఆవిడ నవ్వి, "సందడిగా ఉండేటందుకు!" అన్నది.

ఒక్క నెలరోజులు జానకమ్మగారింట్లో ఉన్న తరవాత మావారికి పోలీసహంకారం పోయింది. వారికి చివరకు ఆవిడమీద నాకన్న ఎక్కువ గౌరవం కలిగింది. ఇంకోటి కూడా జరిగింది. ఈ పోలీసు నౌకరీతో, వారికి ఆలోచించకుండా అనరానిమాటలన్నీ నాయెదుటనే ఉపయోగించటం ఒక దురభ్యాసం అయిపోయింది. జానకమ్మగారిమీద భక్తివల్ల వారా అభ్యాసం చంపుకుని బిగ్గరగా మాట్లాడటం కూడా మానేశారు. పెద్దదిక్కంటే ఇంతేకదా అనుకున్నాను. ఇంతటితో స్వవిషయం మానేసి అసలు సంగతికొస్తాను.

ఆరోజుల్లో ఇంటివారబ్బాయి సత్యనారాయణ, కాలేజీలో ఇంటర్మీడియేట్ చదువుతున్నాడు. అతని కప్పుడు వయసు పదిహేడేళ్ళు. రాధకు పదమూడు వెళ్ళినై. వారికప్పుడే ఆరునెల్ల పిల్లవాడు! తల్లిదండ్రులకంత చిన్నవయస్సులో పుట్టినా, చిట్టి బొద్దుగా గుండల్లె అమిత ముద్దొస్తుండేవాడు; తగని అగం చేసేవాడు, ఇల్లెగిరేటట్టు కేకలు పెట్టేవాడు. ఎప్పుడు పోయినా మేలుకునే ఉండేవాడు.

సామాన్యంగా సాయంత్రం మూడుగంటలనించీ వంటవేళయ్యేవరకూ జానకమ్మగారింట్లోనే ఉండేదాన్ని, సత్యనారాయణ ఉండేవాడుకాడు, మాముగ్గురికీ కావలిసినంత స్వేచ్ఛ.

"ఏమండీ పిన్నిగారూ, చిట్టి నిద్రపోతున్నాడా?" అని అడిగితే ఆవిడ నవ్వుతూ, "వాడికి నిద్దరేమిటమ్మా? మాతో లేస్తాడు, మాతో పడుకుంటాడు." అనేది.

నేను ఒకరోజున చిట్టిని ఆడిస్తూ "ఇంత ముద్దుకారుతుంటే పిల్లాడు, ఎవ్వరూ ఎత్తుకోరేమండీ?" అన్నాను.

"ముద్దొచ్చినప్పుడే ముద్దు పెట్టుకోమన్నారు. ప్రస్తుతం వాడి వెధవ వేషాలన్నీ నాదగ్గిర చలామణీ కావలిసిందే! కాని అమ్మ దగ్గిరా నాన్న దగ్గిరా సాగవు. మావాడు కోపంవస్తే ఒక్కటి పెడతాడు కూడా!".

అదిమాత్రం నిజం చిట్టి ఎన్నడూ ఏడిచేవాడేకాడు, ఆకలైనా ఏ చీమన్నా చిటుక్కుమన్నప్పుడూ తప్ప. సంతోషంతో ఎప్పుడూ కేకలేస్తుండేవాడే అనుకోండి. వాడు కిక్కురుమంటే సరి, సత్యనారాయణ ఇల్లంతె త్తెగిరిపడేవాడు. అతనికి పిల్లవాణ్ణి చూస్తే బొత్తిగా అపేక్షలేదు. అపేక్ష తెలీనిరకమనుకుందామా అంటే అదీకాదు. భార్యనుచూస్తే ప్రాణం. రాధ మొగుణ్ణి చూస్తే-భయభక్తులతో ఉండేది. కాని ఎక్కువ తెలివిగలదికాదు. సత్యనారాయణ ఎప్పుడూ రాధకు ఒక్కముక్క అర్థం కాకుండా మాట్లాడి, ఆపిల్ల తెల్లబోతే నవ్వుతూండేవాడు. ఒక్కసారి క్షూర్థా

కోప్పడేవాడుకాడు. అతనికి భార్య విషయంలో ఎంత ఓర్పు ఉండేది! పిల్లవాణ్ణి చూస్తే అతనికంత అసహ్యం ఎందుకో నాకర్థం కాలేదు. రాధక్కూడా పిల్లవాణ్ణి చూస్తే నిరసనే! వాడి కర్మం ఏమిటో? మామూలుగా రాధ ఎంత శాంతంగానో ఓర్పుగానో ఉండేది. ఎవ్వరితోనూ ఎక్కువ మాట్లాడేదికాదు. అత్తగారు తన్ను కూతురికన్న ఎక్కువగా చూస్తున్నా, ఆవిడ దగ్గర చనువు తీసుకునేదికాదు. ఆవిడ ఎదట బిగ్గరిగా నవ్వేదికూడా కాదు. నిజానికి రాధకూ నాకూ ఎక్కువ స్నేహం కావలసింది, జానకమ్మగారికీ నాకూ ఎక్కువ స్నేహంగా ఉండేది. మేమిద్దరం మాట్లాడుతుంటే రాధ కొంచెం దూరంగా కూర్చునేది. ఇటు వంటి మనిషి, చిట్టి ఆగడం ఒకరవ్వ సహించేదికాదు. ఈ ఇద్దరి విషయం నాకర్థంకాదు. దీన్లో ఏదో కిటుకున్నదనుకున్నాను. చివరకు నేననుకున్నంతా అయింది!

ఒక సాయంత్రం నేను జానకమ్మగారివైపు వెళ్ళేసరికామె లేదు. రాధ ఒక్కత్తే చిట్టిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆడుకుంటున్నది ముద్దుపెట్టుకుంటూ. చిట్టి కూడా తల్లినిచూసి నవ్వుతూ, చేతులతో తల్లిమొహం రుద్దుతూ. మధ్య మధ్య ఏదో మాట్లాడుతూ ఆడుకుంటున్నాడు. నాగుండె నీరైపోయింది. చెప్పొద్దూ! ప్రేమంతా అవతారందాల్చి నాయెదుట నిలబడ్డట్టు భావించుకున్నాను. కళ్ళవెంట నీళ్ళు కూడా వచ్చినయ్యేమో చెప్పలేను. కాని రాధ మొహం ఎర్రగా చేసుకుని నాకందించింది. పిల్లవాణ్ణి తీసుకుంటుంటే నాచేతులు చచ్చుబడ్డట్టయిపోయినై. నేను తీసుకోకపోతే ఏమౌతుంది? ఆరోజుకిక రాధ పిల్లవాణ్ణి దగ్గరికి తియ్యదు, నేను సరిగా ఆ సమయానికే వచ్చి చాలా దరిద్రగొట్టుపని చేశాననుకున్నాను.

నాకిప్పుడంతా అర్థమయిపోయింది. రాధకు నిజంగా పిల్లవాణ్ణి చూస్తే ఆపేక్ష ఉంది కూడా— ఏతల్లికుండదు?— మొగుడికోసం దాచిపెట్టి ఉండాలి! అదేం ఓర్పు! ఒక్క ఇంట్లో అంతఓర్పు కలవాళ్ళిద్దరుండి ఒక మగవాడికోసం తల్లీ కొడుకూ ఎడబాటుకానా? సత్యన్నారాయణ రాక్షసుడనుకున్నాను. అతను తప్పకుండా నరకానికి పోతాడు. బహుశా ఈ సంగతి జానకమ్మగారికి తెలిసి ఉండదు చెప్పదామనుకున్నాను.

నాలుగైదురోజులవరకూ జానకమ్మగారు ఒంటరిగా దొరకలేదు. చివరకు రాధ ఇంట్లో లేకుండా చూసి జానకమ్మగారి దగ్గర ఈ విషయం తమాషాగా తెచ్చాను.

"ఏమండీ, పిన్నిగారూ! చిట్టిని తలిదండ్రులిట్లా చూడటం ఏమీ బాగాలేదు. మీరు కోప్పడితే ఇద్దరూ వింటారు!"

"చూడు, అన్నపూర్ణా! నీకింకా అనుభవంలేదు. నీక్కూడా పిల్లలు పుట్టితేనేకాని అనుభవంకాదు. మా అబ్బాయీ కోడలూ పసివాళ్ళు. వాళ్ళ

నిరాటంకంగా అరునెల్లు కూడా కాపరం చెయ్యకముందే ఈ క్రూరవిధవ ఇద్దరి మధ్యా అడ్డొచ్చాడు. వాళ్ళకది మనసులో ఉండదా? ఉంటే మాత్రం ఎంతకాలం ఉంటుంది? మావాణ్ణి నేనెందుకొప్పుకోవాలి. కాలేజీలోవాడు చాలా తెలివిగలవాడని పేరు. నిజంగా వాడు తెలివితక్కువవాడు కూడా కాడు. కొంచెం తొందర జాస్తిగాని, నిదానంగా ఆలోచిస్తే వాడు నాకన్న వెయ్యిరెట్లు తెలివిగల ఆలోచన చేస్తాడు. భార్యభర్తలా, చాలా అన్యోన్యంగా ఉంటారు. బతికినన్నాళ్ళూ వాళ్ళు ఒకరిమీద ఒకరు ఆపేక్షగా ఉండటమే ఎక్కువ! పిల్లలూ మధ్య వచ్చి కాస్త పెద్దవాళ్ళు కాగానే వాళ్ళదారి వాళ్ళు చూసుకునే వాళ్ళేగా! అందుచేత నేనా విషయం పెట్టుకోలేదమ్మా! ఏం?"

"అంతే ననుకోండి! కాని మీ కోడలికి నిజంగా పిల్లవాడిమీద ప్రేమఉంది. మీ అబ్బాయికి భయపడి ఆపేక్ష చూపించకుండా ఉందనుకోండి"

జానకమ్మగారు నవ్వింది. "నాకూ ఒకప్పుడా అనుమానం వోయింది. కాని పొరపాటు పడ్డాను· మావాడు అటువంటివాడు కాదమ్మా. అది వాడికట్టా భయపడవలసిన అవసరంలేదు. ఇంకా దానికాపేక్ష ఉంటే తనుకూడా ఆపేక్షగా ఉంటాడు. నాకదే ఒక్కొక్కసారి చింత! దానికసలు పిల్లవాణ్ణి చూస్తే లక్ష్యంలేదు."

"ఇట్లా అయితే మీరు నిజంగానే పొరపాటు బడ్డారు. మీకోడలికి పిల్లవాణ్ణి చూస్తే ప్రాణం. నామాట నమ్మండి."

జానకమ్మగారితో నేను చూసిన సంగతంతా చెప్పాను.

ఆవిడ నిర్ఘాంతపోయింది కాస్సేపు. చివరకు ముక్కుమీద వేలుపెట్టుకుని, "ఓసి, అమాయకప్పిల్లా!" అన్నది. తరవాత కొంచెంసేపుండి నవ్వుతూ, "మొగుడికి తన్ను చూస్తే ఎంత ఆపేక్ష ఉందో కూడా ఎరగదు! ఇదేమి సత్యకాలమమ్మా?" అన్నది.

## 3

ఇది జరిగిన వారంరోజులకు జానకమ్మగారు కూతురుగారింట్లో ఒకనెల ఉండిరావటానికి ప్రయాణమైంది. రాధ వద్దని బతిమాలింది. జానకమ్మగారు వెళ్ళాలన్నది, త్వరగా నన్నా రమ్మన్నది కోడలు. అత్తగారు సరే లెమ్మన్నది. కొడుకునూ కోడల్నీ పిల్లవాణ్ణి కనిపెట్టి ఉండమని చెప్పటానికి జానకమ్మగారు నాదగ్గిరికొచ్చింది. నేను కూడా వద్దని చెప్పాను, ఆవిడ ఇంట్లో లేకపోతే సత్యనారాయణ ఏదైనా అఘాయిత్యం పనిచేస్తాడని నాకనుమానం. జానకమ్మగారు నవ్వి ఫరవాలేదంది.

ఉదయం పదింటికి కాలేజీకిపోయి, ఏడుగంటలయ్యేవరకు సాయంత్రం

ఇంటికొచ్చేవాడుకాడు సత్యనారాయణ. నేను పనిలేనప్పుడల్లా రాధ దగ్గిరే కూర్చునేదాన్ని. ఇప్పుడాపిల్ల నా యెదుటనే చిట్టిని ముద్దులాడేది.

"ఏమండోయ్! ఈరోజున మా చిట్టిగాడికి పెద్దగండం గడిచిందండి, వదినెగారూ!"

"ఏం జరిగిందమ్మా?"

"నేను మడిగట్టుకుంటే వాణ్ణి పట్టుకునేవాళ్ళులేరు. వాడిల్లంతా సద్దుతున్నాడు. అన్నీ ఒలకబొయ్యటం, పగలగొట్టటం, కాగితాలు చింపటం! వాడిష్టమే యిష్టం! ఇవాళ్ళ సిరాబుడ్డి ఒలకపోశాడు కామాలు. వాళ్ళనాన్న చూసి వాడే చేశాడని అనుమానపడ్డారు. వాడి అదృష్టం బాగుండి ఒంటినెక్కడా సిరా కాలేదు. అసలు వాడేం ఒలకబోసినా చెయ్యి ఒక్కరవ్వ అంటనీడు. దొంగ! దొంగ పుట్టాడండి మాకు!"

"గండం ఎట్లా తప్పింది మరి?"

"నేనే పొరపాటున ఒలకపోశానని చెప్పాను. అయితే సరిగా తియ్యలేదేమన్నారు. మరిచిపోయి నానన్నాను."

"నువ్వేమన్నా చేస్తే మీ ఆయనకు కోపం లేదేం?"

"నన్నేమనరు! ఓసి పిచ్చికట్టా! అంటారు. అంతే!" రాధ సిగ్గుపడి తల వంచుకుంది. ఆ మాటంటూ—

ప్రతిరోజూ రాధ నాకిటువంటి దేదో చెబుతూనే ఉండేది. సత్యనారాయణ ఆపిల్ల అబద్ధాలు నమ్మినట్టు కనపడేవాడు. కాని ఒకటి మాత్రం నాకు నమ్మకంగా తెలిసింది. అతను మొదటి అబద్ధంలోనే భార్యను పట్టేశాడు. ఎన్ని ఎట్లాఉన్నా అతను తెలివికల వాడనటాని కనుమానం లేదు. కాని అతని భార్య ఎందుకబద్ధం ఆడిందీ, అతని కర్థం కాలేదు. తను చిట్టి విషయంలో ఎట్లా ప్రవర్తిస్తున్నదీ, చిట్టిని గురించి అతన్ని చూసి భార్య ఎట్లా భయపడుతున్నదీ అతనికి తెలియదు. అతనికి చిట్టిని చూస్తే కోపంకూడా లేదు. మొదట్లో కొంచెం ఉన్నా అది అప్పుడే పోయింది. కాని భార్య ప్రవర్తన చూసి తల్లికి లేని ప్రేమ తనకెందుకని ఊరుకున్నాడు. రాధ తనమీద పెట్టుకున్న తప్పులన్నిటికీ సత్యనారాయణ పిల్లవాణ్ణేమీ చేశేవాడు కాడు. కాని కోప్పడేవాడు. రాధకుతనతత్వం తెలుసుననీ, అతను పిల్లవాడిమీద ఎగిరిపడటాన్ని రాధ ఎక్కువ లెక్క చెయ్యటం లేదనీ ఆతని నమ్మకం. మగవాళ్ళకున్నదిదే. వాళ్ళనే మాటలూ చేసే పన్లూ ఆడదానికెట్లా తోస్తున్నదీ గమనించరు.

అలస్యంగానైనా సత్యనారాయణ భార్య స్థితి కనిపెట్టి నిజం తెల్సుకుందామని ఒక యెత్తు యెత్తాడు! ఆ యెత్తు పారింది.

ఆ రోజున జరిగిన సంగతంతా రాధ నాతో చెప్పింది. ఆనాడాదివారం రోజల్లా పరీక్షలకు చదువుతూ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి సాయంత్రం అయిదు కాగానే టెన్నిసు ఆడుకో బోయినాడు. అతను వెళ్ళగానే నేవచ్చాను.

"ఏమండోయ్, వదినెగారూ! ఎంత చిత్రం జరిగిం దనుకున్నారు?" అన్నది రాధనన్ను చూసి.

"ఏమయింది?"

"అది కాదండీ! నేను వంట ఇంట్లో వంట చేస్తున్నానండీ. చిట్టివెధవేమో తోట్లో పడుకుని నిద్రపోతున్నా డనుకొన్నానండి. నాకేం తెలుసు? నేను వంట చేసుకుంటూంటే సావిట్లో వాళ్ళ నాన్న చదూకుంటున్నారు. ఇంతలో వారు "ఓరే! వెధవా" అనేటప్పటి కేం కొంపమునిగిందోనని నేను బయటకొచ్చానండి. ఈ వెధవ కుర్చీ కింద చేరి ఏదో కాగితంచింపి ఆయనకు ముక్క అందించి ఏదో" అంటున్నాడు. ఆయనేమో మండి పడి రూళ్ళకర్ర తీసుకుని "వెధవా" అంటూ కుర్చీలో నుంచి లేచేటప్పటికి నా ప్రాణం నిలువునా పోయి, కళ్ళు గట్టిగామూసు కున్నా నండీ, వదినెగారూ! ఎంత సేపటికీ దెబ్బ వినపళ్ళేదు. నా కళ్ళు తెరవ టానికేమో భయం! కాదూ? చివరకు మాటలు వినపడ్డాయి. కళ్ళు తెరిస్తే ఏమయిం దనుకున్నారు? వాడు వాళ్ళ నాన్న ఒళ్ళో కూచుని రాచకార్యం చేస్తున్నాడు. వారేమో నా వంక తిరిగి నవ్వారు.... నాకు భలే సంతోషంగా ఉంది."

నే నొక్కనిట్టూర్పు విడిచి, జానకమ్మ గారి ధైర్యానికి సంతోషించాను.

తరువాత నేను కళ్ళు మూసుకున్నానని ఎక్కిరించారండి! నాకు భయం వెయ్యదు? చెప్పండి, వదినెగారూ!

"ఏమని వెక్కిరించారు?" అన్నా నజ్ఞానంగా."

రాధ తలవంచి "ఏమీ లేదు" అని నవ్వి ఊరుకుంది.

(ముద్రణ : జూన్ 1933, గృహలక్ష్మి)